క్లుప్తంగా

మాతమ్మకు మోహిత్ రెడ్డి సారె



సారె తీసుకువస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట దళితవాడలో మాతమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తన తల్లి చెవిరెడ్డి లక్ష్మితో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రతి ఏటా తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గ్రామస్తులు సారె తీసుకు వచ్చిన మోహిత్ రెడ్డికి, ఆయన తల్లి చెవిరెడ్డి లక్ష్మికి ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అమ్మ వారిని దర్శించుకున్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి ప్రభుత్వ గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఇందులో ముఖ్య అతిథిగా విశ్రాంత లైబ్రేరియన్ బాలసుబ్రమణ్యం పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన పాఠకులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు సైన్స్, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రెడ్డెమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు 0877–2227208కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



బహుమతులు అందజేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని, చిన్నతనం నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని తిరుపతి బుగ్గమఠం నిర్వాహకురాలు కస్తూరి తెలిపారు. తిరుపతి గోవిందరాజులుస్వామి ఆలయ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ ఒక మంచి పుస్తకాన్ని చదవడం ద్వారా అనేక విషయాలు తెలుస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ మూర్తి బహుమతులు అందజేశారు. ఉద్యోగులు భారతి,లక్ష్మీప్రసన్న, టి.ప్రతాప్, మణికంఠ పాల్గొన్నారు.

శిల్పారామంలో మల్టీ ట్రేడ్ ఎక్స్‌పో ప్రారంభం



లక్కీడిప్‌లో విజేతను ఎంపిక చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ తిరుపతి చాప్టర్, జైకం సంయుక్తంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన మల్టీ ట్రేడ్ ఎక్స్‌పో–2023ను ఆదివారం ప్రారంభించారు. ఇందులో సుమారు 100 స్టాల్స్, వివిధ వ్యాపార సంస్థల ప్రాడక్ట్‌ను అందుబాటులో ఉంచారు. ఇందులో భాగంగా లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి ఒక్క రూపాయికే రక్త పరీక్షలు చేయించారు. సినీ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్.బాబు, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జేసీ.గుణశేఖర్, కార్యదర్శి శేషసాయి, జైకం చైర్మన్ నామా రాజేష్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జేసీ. శంకర్, చైతన్య తేజ్ పాల్గొన్నారు.

ఒంటి పూట బడులు నిర్వహించండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునః ప్రారంభమవుతున్నట్టు ఎంఈవో లలితకుమారి తెలిపారు. ఒంటి పూట బడులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే వారం రోజులు పాఠశాలలు నిర్వహించాలని తెలిపారు. ఉదయం 7:30 గంటలకు విద్యార్థులకు రాగి జావా, 11:30 గంటలకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని సూచించారు. సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికీ పంపిణీ చేయాలన్నారు.

చంద్రగిరి ఐపీయల్‌లో

ముగిసిన మండలస్థాయి పోటీలు

- మూడవ స్థానంలో చిగురువాడ
- 19 పరుగుల తేడాతో ఓడిన పెరుమాళ్లపల్లి
- విజేతలకు ట్రోఫీలు బహూకరించిన హర్షిత్ రెడ్డి
- త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీలు: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చిగురువాడ జట్టుకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పక్కన ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి

తిరుపతి రూరల్: 1000 జట్లు.. 15 వేల మంది క్రీడాకారులతో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీయల్‌గా కీర్తించే వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో మండల స్థాయి పోటీలు ముగిశాయి. టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్వర్యంలో 40 రోజులుగా జరుగుతున్న పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీల్లో మిగిలి ఉన్న ఒకే ఒక్క మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. ఇందులో గెలుపొందిన చిగురువాడ జట్టు మూడో స్థానంలోనూ, పెరుమాళ్లపల్లి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని బాల, బాలికల క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బహుమతులు, ట్రోఫీలు బహూకరించారు.

చెలరేగిన చిగురువాడ, పోరాడిన పెరుమాళ్లపల్లి

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో తిరుపతి రూరల్ మండలం నుంచి మూడు, నాలుగు స్థానాలకు జరిగిన మ్యాచ్ లలో చిగురువాడ, పెరుమాళ్ల పల్లి జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిగురువాడ జట్టు 10 ఓవర్లలో 104 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన పెరుమాళ్లపల్లి జట్టు 84 పరుగులకే ఆల్ అవుట్ అయింది. 19 పరుగుల తేడాతో చిగురువాడ జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.50 వేల బహుమతి, ట్రోఫీని కై వసం చేసుకుంది. అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన పెరుమాళ్లపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25 వేలు నగదు బహుమతి అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గుణ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్‌గా శేఖర్‌కు బహుమతి ఇచ్చారు. కాగా తిరుపతి రూరల్ మండలం స్థాయి ఫైనల్స్ పోటీలు ఇప్పటికే పూర్తి కావడంతో మొదటి విజేతగా మంగళం భజరంగి జట్టు, రెండవ విజేతగా అవిలాల జట్టు నిలిచిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి రఘునాథరెడ్డి, ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీలు

చంద్రగిరి ఐపీయల్ టోర్నమెంట్‌లో భాగంగా మండల స్థాయి పోటీలు ప్రశాంతంగా ముగియడంతో టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. సహకరించిన ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల స్థాయి విజేతలతో త్వరలోనే నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ మేరకు షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు.

లేఅవుట్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: శెట్టిపల్లి భూముల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారికి అందజేసేందుకు చేపట్టిన లైఅవుట్ల పనులను ఆదివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు మోసాలకు వేలాది మంది పేదలు బలైపోయారని ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో వారి స్థలాలను లాక్కునేందుకు రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు జరగకుండా ఆపించారని దుయ్యబట్టారు. తిరుపతి కార్పొరేషన్ సహకారంతో వేలాది మంది పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. శెట్టిపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బత్తినబాబు, శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో లక్ష మందితో యానాది గర్జన



మాట్లాడుతున్న కేసీ.పెంచలయ్య

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మందికి పైగా జనాభా ఉన్న యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఆగస్టులో లక్షల మందితో యానాది గర్జన నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కేసీ.పెంచలయ్య తెలిపారు. గిరిజన భవన్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని 8 జిల్లాల నుంచి యానాది సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఆయన మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఇస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులుగా యానాదులను నియమించాలని కోరారు. యానాదుల జనాభా అధికంగా ఉన్న కోవూరులో ఎమ్మెల్యే సీటును యానాదులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యానాది సంఘం నేతలు మేకల శ్రీనివాస చక్రవర్తి, యందేటి వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, ఉష, బాపట్ల బ్రహ్మయ్య, శ్రీమంతుల రామయ్య, సరస్వతమ్మ, గోపి, చందమామల కోటయ్య, శ్రీనివాసులు, తిరుమలశెట్టి శ్రీనివాసులు, చెంగల్ రాయులు, విజయ్‌కుమార్, చెంచు మల్లికార్జున, యల్లంపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

శవాన్ని పూడ్చాలంటే పంచాయతీలేనా..?

- ఆక్రమణలను తొలగించేంత వరకు పోరాటాలు
- దహనక్రియలపై ఇరువర్గాల మధ్య ఘర్షణ



చెంగల్‌రాయులుకు అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళుతున్న హరిజనవాడ వాసులు

తిరుపతి మంగళం: బంధువులు, సన్నిహితులు చనిపోయినప్పుడు కలిగే బాధకన్నా వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు పడే బాధ తీవ్రంగా ఉందని తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ వాసులు వాపోతున్నారు. తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే ఆ శవాన్ని పూడ్చాలంటే శవ పంచాయతీలు జరగాల్సిందేనా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం హరిజనవాడలో ఆదివారం చెంగల్‌రాయులు మృతి చెందాడు. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించడానికి మృతదేహాన్ని హరిజనవాడకు ఎదురుగా ఉన్న వందేళ్ల నాటి శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ పూడ్చడానికి వీలులేదని కొందరు టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. తాతల కాలం నాటి నుంచి ఇక్కడే అంతక్రియలు నిర్వహిస్తున్నామని బాధితులు చెప్పినా వారు పట్టించుకోలేదు. దీంతో బాధితులు పట్టుబడి అక్కడే అంత్యక్రియలు చేశారు. ఈ క్రమంలో ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు శతవిధాలా ప్రయత్నించారు. వారికి తిరుపతి నగరానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు మద్దతుగా వచ్చి గొడవలకు కారకులుగా నిలిచారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమించుకున్నారని, ఇప్పుడు శ్మశానాన్ని ఆక్రమించుకున్న వారికి మద్దతుగా వచ్చారా? అంటూ స్థానికులు వారిపై తిరగబడ్డారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. వందేళ్ల నాటి శ్మశానంలోనే అంత్యక్రియలు జరిపించారు. తమ శ్మశానంలోని ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజేష్ గాంధీకి పీహెచ్‌డీ

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన రాజేష్ గాంధీ గుంటికి పీహెచ్‌డీ లభించింది. ఆయన ప్రొఫెసర్ చింతల పరమగీతం పర్యవేక్షణలో ఇన్‌ఫ్లుయన్స్ ఫిజికో–కెమికల్ పారామీటర్స్ ఆన్ లిపిడ్ కంటెంట్ ఆఫ్ ఫోర్ మెరైన్ ప్లాక్‌టానిక్ డై ఆటమ్ స్పీసీస్ ఫర్ బయోడీజిల్ ప్రొడక్షన్ అనే అంశంపై పరిశోధన చేశారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: కేంద్ర మంత్రి ఎల్ మురుగన్‌కు ఆదివారం బీజేపీ నాయకులు పద్మావతి అతిథి గృహం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకున్న ఆయనకు పద్మావతి అతిథి గృహం వద్ద బీజేపీ నేతలు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తొండం నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి , విజయ్ కుమార్ రెడ్డి, దీపక్ యాదవ్, మస్తాన్ తదితరులు స్వాగతం పలికారు.

తిరుపతి బస్టాండ్‌లో రద్దీ



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. రద్దీ ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. ఏ సర్వీస్ బస్సు వచ్చినా ఎక్కడానికి ప్రయాణికులు క్యూకట్టారు. ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఆర్డినరీ సర్వీసులు రద్దీగా నడిచాయి. ప్రయాణికులను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు కనిపించలేదు. ఈ క్రమంలో ప్రయాణికుల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

మొదటి ఘాట్‌రోడ్డులో బస్సు ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డు మాల్వాడి గుండం వద్ద ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందర అద్దాలు ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

యూజర్ చార్జీలతో స్వచ్ఛతపై ప్రజలకు హక్కు

- జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే వసూలు
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత



తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని అమలు చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్ పటిష్ట వ్యవస్థను నిర్వహిస్తోందని కమిషనర్ హరిత తెలిపారు. ఇందుకోసం ప్రతిఏటా రూ. కోట్లు వెచ్చిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్మికులు చెత్త సేకరణ మొదలు ప్రాసెసింగ్ వరకు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ స్వచ్ఛ తిరుపతి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. తద్వారా ప్రజలకు స్వచ్ఛతపై హక్కు లభిస్తుందన్నారు. ఆమె సాక్షిలో మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు

గ్లోబల్ వార్మింగ్, వ్యర్థాల వల్ల కలిగే అనర్థాల నుంచి మానవాళికి ఉపశమనం కలిగించేందుకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే చెత్తను రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్, సెగ్రిగేషన్‌ను తప్పనిసరి చేసింది. ఎన్‌జీటీ నిబంధనలను వందశాతం అమలుచేయని నగరాలకు వందల కోట్లలో జరిమానా విధిస్తున్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాలకు ఇటీవల రూ.కోట్లు జరిమానా విధించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు అనుగుణంగా నగరంలో వందశాతం చెత్తను సెగ్రిగేషన్ చేస్తున్నారు. చెత్త నిర్వహణకు ఏటా కోట్లు ఖర్చుచేస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరణ మొదలు చెత్తను రీయూజ్ చేసే వరకు పటిష్ట వ్యవస్థ పనిచేస్తోంది. చెత్త సేకరణకు యూజర్ చార్జీలు వసూలుచేయాలని ఎన్‌జీటీ నిబంధన విధించింది. ఆ మేరకే తిరుపతి నగరంలో రోజుకు రూ.2 లెక్కన యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తెలిపారు.

ప్రజలకు హక్కు

యూజర్ ఛార్జీలు చెల్లిస్తుండడం వల్ల ప్రజలకు స్వచ్ఛతపై ప్రశ్నించే హక్కు ఉంటుంది. ప్రతిరోజూ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటికి వచ్చి చెత్తను సేకరించాలి. అలానే రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉంచాలి. చెత్త సేకరించకున్నా, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా వెంటనే సంబంధిత సిబ్బందిని ప్రశ్నించవచ్చు. మన ప్రాంతాన్ని మన ఇంటిని మరింత పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు ఇదో హక్కు. ప్రజలు యూజర్ చార్జీలను భారంగా భావించరాదు. ఇది బాధ్యతగా గుర్తించాలి.

గతంలో ఇలా:

గతంలో ఇంటికి వచ్చి చెత్త తీసుకెళ్లే విధానం లేదు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోసేవారు. కూడళ్లలో ఉన్న డస్ట్ బిన్‌లలో చెత్త దిబ్బలుగా దర్శనమిచ్చేవి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవించేది. ఈ క్రమంలోనే అధికారులు దశలవారీగా చెత్తపై సమరం సాగించారు. ఎన్‌జీటీ ఆదేశాలు 2017లోనే అమలులోకి వచ్చాయి. అప్పటి నుంచి కొన్ని ప్రాంతాల్లో యూజర్ చార్జీలను వసూలు చేస్తున్నారు. నిబంధనలను కఠినతరం చేయడంతో ఇటీవలచి యూజర్ చార్జీలను పక్కాగా వసూలు చేయాల్సి వస్తోంది. పారిశుద్ధ్య విషయంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చి ప్రజలకు క్లీన్ తిరుపతిని, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించడానికి కార్పొరేషన్ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజలు భాగస్వాములైతేనే స్వచ్ఛ తిరుపతి సాధ్యం. గృహ సముదాయాల నుంచి రూ.30 – రూ.60, వాణిజ్య సముదాయాలు రూ.100 నుంచి రూ.2,000 వరకు, హోటల్స్ రూ.5,000 వరకు, స్టార్ హోటల్స్, మాల్స్ రూ.10,000 వరకు స్థాయిని బట్టి వసూలు చేస్తున్నారు. ఈ డబ్బును తిరిగి నగర పరిశుభ్రత కోసం ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలి.

ప్రజల ఆరోగ్యమే ధ్యేయం



యడమవారిపల్లెలో వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

భాకరాపేట: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లె, యడమవారిపల్లెలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సందర్శించారు. రక్త నమూనాల సేకరణ, వైద్యుల పర్యవేక్షణ, భోజన వసతి, మందుల పంపిణీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని పనులు ఉన్నా కొంత సమయం కేటాయించుకుని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తద్వారా ప్రాణాంతకమైన రోగాలు నుంచి బయట పడే అవకాశం ఉంటుందన్నారు. ఇంటింటికీ వెళ్లి వైద్య శిబిరం జరిగే ప్రదేశం, వైద్య పరీక్షల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ మాధవి, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు, రఘునాథరెడ్డి, కొండారెడ్డి, మునిరాము, భూషణ, వైద్యాధికారులు శశికళ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీ భార్య శ్రావణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత బాలాజీ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ మోహిత్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని బాలాజీ భార్య శ్రావణి, పిల్లలు రోహిత్, ఉదయశ్రీని పరామర్శించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుమల: శ్రీవారిని ఆదివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీలు వెంకటసత్యవతి, కనకమేల రవీంద్ర కుమార్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, సినీనటి సోనాల్ చౌహాన్ దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

చంద్రబాబు మేనిఫెస్టో చూసి నవ్వుకుంటున్నారు

చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో మోస పూరితమైనదని, దీన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని డెప్యూటీ సీఎం నారాయణ స్వామి విమర్శించారు. దేశ చరిత్రలోనే అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసే నాయకుడు సీఎం జగన్ ఒక్కరేనన్నారు. శ్రీకాళహస్తిలో నిర్వహించిన సభలో బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలు వాస్తవ దూరమన్నారు. పేదల కోసం సంక్షేమం , అభివృద్ధికి కృషి చేసి ఉంటే వారు అలా మాట్లాడి ఉండరని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఎన్ని యాత్రలు చేసినా ఉపయోగం లేదన్నారు.

ఆదిజాంబవంతుడి ఆలయం నిర్మించాలి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ఆది జాంబవంతుడి ఆలయాన్ని నిర్మించాలని వెంకటేశ్వర స్వామిని వేడుకున్నట్టు తెలిపారు. ఒంటిమిట్ట రామాలయాన్ని నిర్మించింది ఆది జాంబవంతుడేనని, అలాంటి ఆది జాంబవంతుడుకి ఒక్క ఆలయం కూడా లేక పోవడం బాధాకరమన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్. జగన్ నవరత్నాలు అనే మేనిఫెస్టోను ప్రవేశ పెట్టారని, నవరత్నాల్లో పొందు పరిచిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారని గుర్తుచేశారు.

30 నుంచి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ చేపడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 30న ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ చేస్తారు. జూలై 1వ తేదీ ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం చేపడతారు. జూలై 2వ తేదీ ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామికి ఏకాంతంగా ఆస్థానం నిర్వహిస్తారు.

చిన్నారి సహనకు సత్కారం



తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శనివారం రాత్రి భరత నాట్యంలో అరంగేట్రం చేసి అద్భుతంగా అభినయించిన చిన్నారి సహనను ఆదివారం బైరాగిపట్టెడలోని తాత సుబ్బన్న నివాసంలో పలువురు సాహితీ, విద్యావేత్తలు సత్కరించారు. చిన్నారి సహన మాట్లాడుతూ నాట్యం ద్వారా భారతీయ సంస్కృతి, ఔన్నత్యంతో పాటు ఓర్పు, పట్టుదల, పరిశ్రమ వంటి గుణాలు అలవడ్డాయని తెలిపారు. అధికార భాషా సంఘం సభ్యురాలు డాక్టర్ మస్తానమ్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహులు, తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి టెంకాయల దామోదరం, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, మానవ వికాస వేదిక సమన్వయ కర్త సాకం నాగరాజు, ప్రముఖ రంగస్థలి కళాకారులు బొందు రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రికెట్ విజేత రాయలసీమ లయన్స్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, ఐపీఎస్ అధికారి ఆవుల రమేష్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి తుడా: ఎస్వీ యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాల క్రీడా మైదానాల్లో ఆదివారం నిర్వహించిన జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాయలసీమ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతులు ప్రదానోత్సవంలో ఐపీఎస్ అధికారి ఆవుల రమేష్ రెడ్డి, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, రమాదేవి ఆసుపత్రి అధినేత డీబీ శశిధర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉదయం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఎస్వీయూ పీడీ శివశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ టోర్నీలో 13 జిల్లాల నుంచి క్రీడా జర్నలిస్టులు పాల్గొన్నారు. ముందుగా కోస్తా టైగర్స్ జట్టుపై రాయలసీమ లయన్స్ గెలిచి ఫైనల్‌కు చేరింది. అలానే ఉత్తరాంధ్ర వారియర్స్‌పై కృష్ణా గోదావరి (కే జీఎఫ్) ఫైటర్స్ గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో కేజీఎఫ్ ఫైటర్స్‌తో తలపడిన రాయలసీమ లయన్స్ ఘన విజయం సాధించి విన్నర్‌గా కప్పును గెలుచుకుంది. ఆవుల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిజం నాలుగో స్తంభమని, తాను జర్నలిస్టు కావాలనుకుని ఐపీఎస్‌కు ఎంపిక అయ్యానని తెలిపారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులు ఫిట్నెస్‌పై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌కు 13 జిల్లాల నుంచి జర్నలిస్టులంతా ఒకే వేద పైకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఓ శ్రీహరి, శశిధర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యం పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు, కార్యదర్శి ఎం.శివశంకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పులిగోరు శ్రీనివాసులు, నెల్లూరు శ్రీనివాసులు, ట్రెజరర్ సుబ్రమణ్యం, మేనేజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.